

మణిపూర్‌లో నాజీల పాలన

మణిపూర్ రాష్ట్రంలో నాజీల పాలన సాగుతోందని రచయిత్రి కూర్ఫినా కిమ్కోవా అన్నారు.

- 10లో▸



బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరం

బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని సీడీపీఓ స్వామి అన్నారు. జిల్లాలో తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతున్నాయి.

- 11లో▸

గరిష్ఠం/కనిష్ఠం

32⁰/26⁰

వాతావరణం

జిల్లాలో పొడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'గృహలక్ష్మి'కి దరఖాస్తులు సమర్పించాలి



ములుగు: ఈ నెల 10వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న గృహలక్ష్మి పథకం కింద లబ్ధి పొందడానికి అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం జారీ మార్గదర్శకాల మేరకు జిల్లాలోని అసెంబ్లీ నియోజవర్గానికి 2,590, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వెంకటాపురం(కె), వాజేడు మండలాల్లో 1200 ఇళ్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు. జిల్లా మొత్తంగా 3,790 ఇళ్లు మంజూరైనట్లు వివరించారు. దరఖాస్తుదారుల జాబితాను ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. అర్హులైన వారు మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో దరఖాస్తులు అందించాలని సూచించారు. 20వ తేదీ వరకు క్షేత్రస్థాయి విచారణ చేపట్టి 25వ తేదీ వరకు ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని వివరించారు. మధ్య దళారులు ఇళ్లు ఇప్పిస్తామని చెబితే నమ్మి మోసపోవద్దని సూచించారు.

సరితకు డాక్టరేట్ ప్రదానం



వెంకటాపురం(ఎం): కాకతీయ యూనివర్సిటీ గణిత శాస్త్రం పరిశోధకురాలిగా మండల పరిధిలోని పాలంపేట గ్రామానికి చెందిన జి.సరితకు డాక్టరేట్‌ను కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి శనివారం ప్రకటించారు. మార్కోవ్ ప్రోసెస్ ఇన్ రిలియాబిలిటీ మోడల్స్ - ఫర్ ఫర్ఫామెన్స్ స్టడీ అంశంపై కేయూ గణితశాస్త్ర విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ తిరుమలాదేవి పర్యవేక్షణలో సరిత పరిశోధన పూర్తి చేసినట్లు వెల్లడించారు. మండల పరిధిలోని పాలంపేట గ్రామానికి చెందిన సరిత ఆదివాసీ కులంలో జన్మించి నేషనల్ ఫెలోషిప్ ఫర్ హైయర్ ఎడ్యుకేషన్ ఆఫ్ ఎస్టీ స్టూడెంట్‌గా ఫెలోషిప్ అందుకున్నందుకు అధ్యాపకులు, బంధువులు అభినందించారు.

ప్రత్యేక ఆర్థిక సాయం ప్రకటించాలి



ఏటూరునాగారం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదల కారణంగా ముంపునకు గురైన కొండాయి గ్రామ విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సాయం ప్రకటించాలని తెలంగాణ ప్రోగ్రెస్సివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె నాగరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో కొండాయి గ్రామ విద్యార్థులను నాగరాజు శనివారం కలిసి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు, పొలాలు పూర్తిగా కొట్టుకు పోవడంతో తల్లిదండ్రులు పూర్తిగా నిరాశ్రయులు కావడం చూసి విద్యార్థులు మానసికవేదనకు గురవుతున్నారన్నారు. వరదలు వచ్చినప్పటి నుంచి చాలా మంది విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకుండా ప్రభుత్వం కల్పించిన పునరావాస కేంద్రాల్లోనే తల్లి దండ్రులతో కలిసి ఉంటున్నారని తెలిపారు. దీనివల్ల విద్యార్థులు చాలా నష్టపోతున్నారని వివరించారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు ప్రత్యేక ఆర్థిక సాయం ప్రకటించి విద్యార్థులు చదువుకు దూరం కాకుండా చూడాలని ఆయన కోరారు.

రాజ్యాధికారానికి ఏకం కావాలి

భూపాలపల్లి రూరల్: బీసీలు రాజ్యాధికారానికి ఏకం కావాల్సిన అవసరం ఉందని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఉద్యోగుల సంఘం కార్యాలయంలో బీసీ రాజ్యాధికార సమితి జిల్లా ఇన్‌చార్జ్ చేపూరి ఓదెలు ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాసు సురేష్ మాట్లాడుతూ బీసీలు ఐక్యంగా పోరాటం చేస్తేనే రాష్ట్రంలో బీసీలకు రాజ్యాధికారం దక్కుతుందన్నారు. బీసీలను ఐక్యంగా లేకుండా చేయడం కోసం కొంతమంది స్వార్థపూరిత రాజకీయ నాయకులు బీసీల ఐక్యతను దెబ్బతీస్తున్నారని చెప్పారు. బీసీలందరూ చైతన్యవంతులై రాష్ట్రంలో బీసీల ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడే విధంగా పోరాటం చేసి విజయం సాధించాల్సి ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటివరకు ఒక్క ముఖ్యమంత్రి కూడా బీసీ సామాజిక వర్గానికి చెందినవారు కాలేదని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు భీమనాధుని సత్యనారాయణ, పరకాల రాజు, పొన్నాల కొమురయ్య, బుర్రి కుమారస్వామి, సకినాల మల్లయ్య, కాశం ఒదెలు, కంబాల రాజయ్య, చలికాని సతీష్, అన్న రాజు, అనిల్, వేణు, శ్రీకాంత్ ప్రదీప్ పాల్గొన్నారు.

స్నేహితం

నేడు స్నేహితుల దినోత్సవం

- కష్టాల్లో ఉన్న స్నేహితులకు ఆపన్నహస్తం
- సామాజిక మాధ్యమాల ద్వారా హెల్పింగ్ హ్యాండ్స్
- ఎంత స్థాయికి ఎదిగినా బచ్‌పన్ దోస్త్‌లను వీడని వారెందరో..



- మరిన్ని కథనాలు 10లో▸

స్నేహం గొప్పది..



స్నేహితుడిని కుర్చీలో కూర్చోబెట్టిన ఎస్పీ గాష్‌ఆలం

ములుగు: జీవితంలో స్నేహం గొప్పదని ఎస్పీ గాష్ ఆలం అన్నారు. నేడు స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఎస్పీని పలకరించిన 'సాక్షి' తో మాట్లాడారు. స్నేహానికి వెలకట్టలేమన్నారు. తాను ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న అనంతరం ఢిల్లీలో పోస్టల్ శాఖలో ఉన్నత పదవిలో ఉన్న తన స్నేహితుడు ఆకాష్ శర్మను మర్యాద పూర్వకంగా తన కుర్చీలో కూర్చోబెట్టి గౌరవం ఇచ్చి స్నేహానికి అర్థం చెప్పినట్లు వివరించారు. జీవిత గమనంలో ఎంతో మంది పరిచయం అయినా స్నేహితుడు మన మంచి కోరతాడని వివరించారు. కష్టసుఖాల్లో తల్లిదండ్రులు, సతీమణితో పాటు స్నేహితుడు పాలు పంచుకుంటాడని తెలిపారు.

నమ్మకం, గౌరవంతో కొనసాగుతున్నాం..



స్నేహితులతో ఎస్పీ కరుణాకర్

చిన్న నాటి నుంచి నేటి వరకు పరిచయమైన వారిలో కొందరు ఆప్తమిత్రులు, ప్రాణ స్నేహితులు ఉన్నారని భూపాలపల్లి ఎస్పీ పుల్లా కరుణాకర్ తెలిపారు. నేడు స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఎస్పీని పలకరించగా 'సాక్షి'తో మాట్లాడారు. స్నేహితులందరం నమ్మకం, గౌరవంతో ఉంటున్నామని తెలిపారు. ఎంత గొప్పస్థాయిలో ఉన్నప్పటికీ స్నేహానికి ఉన్న బంధం జీవితాంతం ఉంటుందన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీల్లో స్నేహితులైన జయప్రకాశ్, రంజిత్, ప్రసాద్, రవికుమార్, నేను నిత్యం కలుసుకుంటామని తెలిపారు. అన్ని రకాల విషయాలను వారితో పంచుకుంటానని వివరించారు. స్నేహితులందరం ప్రతి ఫంక్షన్‌కు హాజరవుతాం... బంధువుల మాదిరిగా కలిసి ఉంటూ స్నేహబంధానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని వివరించారు.

సెకండ్ ఏఎన్‌ఎంల సమ్మెబాట

డీఎంహెచ్‌ఓకు నోటీస్ అందజేత

- పీహెచ్‌సీల ఎదుట నిరసన
- డిమాండ్లు నెరవేర్చకపోతే 15నుంచి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరిక



కలెక్టరేట్ అధికారికి మెమోరాండం అందిస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

ములుగు: ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంపై సెకండ్ ఏఎన్‌ఎంలు సమ్మెబాట పట్టనున్నారు. ఈ మేరకు ఇప్పటికే తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్(సీఐటీయూ) యూనియన్ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్యకు సమ్మె నోటీస్ అందించారు. అనంతరం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయ అధికారికి మెమోరాండం అందజేశారు. ఈ నెల 14వ తేదీ వరకు ప్రభుత్వం స్పందించని పక్షంలో 15వ తేదీ నుంచి సమ్మె చేపట్టడానికి సిద్ధంగా ఉన్నారు. ఇందులో భాగంగా శనివారం మంగపేట మండలంలోని మంగపేట, బ్రాహ్మణపల్లి, చుంచుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ) ఎదుట రెండో ఏఎన్‌ఎంలు సమ్మె నిర్వహించారు. 2016లో సీఎం కేసీఆర్ ఇచ్చిన 11వ పీఆర్సీ అమలు, ఉద్యోగ భద్రత, రెగ్యులైజేషన్, హెచ్‌ఆర్‌ఏ, డీఏ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే గ్రామాల్లోని పంచాయతీ సిబ్బంది సమ్మెలో ఉన్న తరుణంలో వైద్య సిబ్బంది సమ్మెకు దిగడానికి నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. సమ్మె కొనసాగిస్తే మొదటి ఏఎన్‌ఎంలు లేని సబ్ సెంటర్లలో వైద్య సేవలు నిలిచి పోనున్నాయి. ఆశ కార్యకర్తలు ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో సేవలు అందే అవకాశం కనిపించడం లేదు.

15 పీహెచ్‌సీలు... 87 మంది రెండో ఏఎన్‌ఎంలు

జిల్లాలోని తొమ్మిది మండలాల్లో 15 పీహెచ్‌సీలు ఉండగా 89 సబ్ సెంటర్ల పరిధిలో ప్రస్తుతం 87 మంది రెండో ఏఎన్‌ఎంలు విధులు నిర్వహిస్తున్నారు. మొదటి ఏఎన్‌ఎం(రెగ్యులర్)లతో కలిసి సమానంగా పని చేస్తున్నా ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఎన్‌హెచ్‌ఎం తరపున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో రోగి కళ్యాణ సమితి ఆధ్వర్యంలో సెకండ్ ఏఎన్‌ఎంలను విధుల్లోకి తీసుకున్నారు. 20 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నా ఇప్పటి వరకు సరైన వేతనం అందించడం లేదు. రెగ్యులర్ ఏఎన్‌ఎంలకు సీనియారిటీ ప్రకారం సుమారు రూ. 90 నుంచి రూ.లక్ష వరకు వేతనాన్ని అందుకుంటున్నారు. ఇదిలా ఉంటే తమ కంటే వెనుక విధుల్లో చేరిన హెల్త్ అసిస్టెంట్లను రెగ్యులరైజ్ చేసిన ప్రభుత్వం సెకండ్ ఏఎన్‌ఎంలను మాత్రం పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. 2016లో 10 రోజుల పాటు సమ్మె చేసిన సమయంలో ప్రభుత్వం 10వ పీఆర్సీని అమలు చేయడంతో ప్రస్తుతం రూ. 25,300 వేతనం అందుతోంది.



డీఎంహెచ్‌ఓకు నోటీసు అందిస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

అన్నీతామై చూసుకుంటున్నారు...

మొదటి ఏఎన్‌ఎం లేని సబ్ సెంటర్లలో రెండో ఏఎన్‌ఎంలు అన్నీ తామై చూసుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు టీకాలు వేయడం, సర్వే నిర్వహించడం, గర్భిణులను ఆశ కార్యకర్తల ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి డెలివరీ చేయించడం, ఇంటింటా సర్వేలు చేయడం, వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయడం వంటి బాధ్యతను నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. న్యాయ పరంగా ప్రగతి భవన్ ముట్టడికి వెళ్లిన సెకండ్ ఏఎన్‌ఎంలను ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టులు చేయడంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన అనంతరం కాంట్రాక్ట్ వ్యవస్థ లేకుండా చేస్తామని చెప్పిన సీఎం కేసీఆర్‌కు తమ ఇబ్బందులు తెలియడం లేదా అని అడుగుతున్నారు.

హామీలను నెరవేర్చాలి



2016 సంవత్సరంలో 10 రోజుల పాటు సమ్మె చేపట్టిన సమయంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం 10వ పీఆర్సీని అమలు చేసింది. కానీ క్షేత్రస్థాయిలో 11వ పీఆర్సీని అమలు చేయలేదు. మొదటి ఏఎన్‌ఎంలతో సరిసమానంగా విధులు నిర్వహిస్తున్నా సెకండ్ ఏఎన్‌ఎంల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదు. ఉద్యోగ భద్రతతో పాటు డీఏ, హెచ్‌ఆర్‌ఏ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మె నోటీసులను అందించాం. ఈ నెల 14వ తేదీ వరకు అమలు చేయకపోతే సమ్మెను కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నాం.

- ఎట్టి జమునారాణి, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

దాతల సేవలు మరువలేనివి..



మందులను అందజేస్తున్న ఏఎస్పీ సంకీర్త్



ముంపు బాధితులకు వంట పాత్రలు అందజేస్తూ..

ఏఎస్పీ సంకీర్త్

ఏటూరునాగారం: కొండాయి, మల్యాల, దొడ్ల, ఇతర గ్రామాల్లోని వరద బాధితులకు అండగా నిలుస్తున్న దాతలు, స్వచ్ఛంద సంస్థల సేవలు మరువలేనివని ఏఎస్పీ సంకీర్త్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లోని పునరావాస కేంద్రంలో ఏర్పాటు చేసిన వరద బాధితులకు ఏటూరునాగారం, వాజేడు కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఎస్పీ సంకీర్త్ హాజరై వైద్య శిబిరంలో రోగులకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. ఉచితంగా వైద్య శిబిరాలు, మందులు అందజేస్తున్న యజమానికి, వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఆపదలో ఉన్న ప్రజలకు ఏదో ఒక రూపంలో ఆదుకోవాలన్నారు. దాతలు తోచిన సాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజు, ఎస్సై కృష్ణ ప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ క్రాంతికుమార్, వైద్యులు నాగరాజు, వినీల, ప్రవీణ, రుచిత, సాయి, జిల్లా డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యదర్శి అజ్మత్‌ఖాన్, హబీబ్‌ఖాన్, లక్ష్మణ్‌దేవ్, రాజు, గోపి, మహేష్, వైకుంఠం, సోమిడి సారంగపాణి, రాము, మొగిళి, రాజు, గౌరీశంకర్ పాల్గొన్నారు.

వరద బాధితులకు వంట పాత్రల అందజేత

మండల పరిధిలోని కొండాయి, మల్యాల, దొడ్ల, అల్లవారి ఘనపురం వరద బాధిత ఆదివాసీ గిరిజన కుటుంబాలకు హనుమకొండ 53వ డివిజన్ ఆదర్శ కాలనీవాసులు తమ వంతు సాయంగా 300 కుటుంబాలకు రూ.50వేల విలువైన వంట పాత్రలను శనివారం పునరావాస కేంద్రాల్లో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ కాలనీ అభివృద్ధి కమిటీ గౌరవ సలహాదారు సుందర్‌రావు, అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల వేణు, కోశాధికారి నరసింహస్వామి, ఉపాధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి, కార్యదర్శి రామిరెడ్డి, సభ్యులు వెంకట్ రెడ్డి, సామాజిక న్యాయ వేదిక జిల్లా మహిళా అధ్యక్షురాలు మడే పూర్ణిమ, విద్యా విభాగం అధ్యక్షులు కొప్పుల రవీందర్ పాల్గొన్నారు.

కొండాయిలో బ్రిడ్జి నిర్మించాలి

- మృతుల కుటుంబాలను ఆదుకోవాలి
- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

ఏటూరునాగారం: ములుగు నియోజకవర్గం పరిధిలోని కొండాయిలో బ్రిడ్జి కొట్టుకుపోయి రవాణా సౌకర్యం లేదని, వెంటనే బ్రిడ్జి నిర్మించాలని ములుగు ఎమ్మెల్యే సీతక్క అసెంబ్లీలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే జిల్లాలో 15 మంది మృత్యువాత పడ్డారని, ఒక కొండాయి ప్రాంతంలోనే 8 మంది చనిపోవడం బాధాకరమని వివరించారు. ఇళ్లు, సర్వస్వం కోల్పోయి ముంపు ప్రాంతాల ప్రజలు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరదల వల్ల నష్టపోయిన ప్రతీ బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరారు. ప్రజలకు హామీస్తూ శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అలాగే రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిలు, కాజ్‌వేలు కూడా కూలిపోయాయని, దీనివల్ల ప్రజలకు రవాణా సౌకర్యం లేకుండా పోయిందని సీతక్క మంత్రి దయాకర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ మాధవి



వాజేడులో పరిశీలనకు వెళ్తున్న ఆర్డీఓ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఆర్డీఓ మాధవి పరిశీలించారు. మండల పరిధిలోని ఎదిర, సూరవీడు, ఆలుబాక, రామచంద్రాపురం, వెంకటాపురం మండల కేంద్రాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో ఉన్న పోలింగ్ స్టేషన్‌లో నూతన భవన నిర్మాణ పనులు సాగుతుండడంతో త్వరితగతిన పనులు పూర్తి అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీటీ మహేందర్, ఆర్‌ఐ మల్లేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వాజేడులో..

వాజేడు: పోలింగ్ స్టేషన్లలో ఎన్నికల నియమావళి ప్రకారం అన్ని సౌకర్యాలు ఉండాలని భద్రాచలం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, భద్రాచలం ఆర్డీఓ కె.మాధవి అన్నారు. మండల కేంద్రంలోని పోలింగ్ స్టేషన్లను ఆమె శనివారం తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు, మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. అవి లేని చోట వెంటనే ఏర్పాటు చేయించాలని తహసీల్దార్ శ్రీనివాస్‌కుసూచించారు. అర్హులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. ఆర్డీఓ వెంట వాజేడు తహసీల్దార్ ఎస్.శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ రాహుల్ చంద్రవర్మ, ఆర్‌ఐ రాజు ఉన్నారు.

మోరంచపల్లి వాసులకు అండగా నిలవాలి

- జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న భాస్కర్‌రావు-అరుణ దంపతులు

భూపాలపల్లి రూరల్: వరదల్లో సర్వస్వం కోల్పోయిన మోరంచపల్లి వాసులకు సహాయం చేసి మానవత్వం చాటుకోవాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణబాబు అన్నారు. శనివారం వరద బాధితులను కర్నాటక రాష్ట్ర హైకోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి వై. భాస్కరరావు-అరుణ దంపతులతో కలిసి జిల్లా జడ్జి నారాయణబాబు పరామర్శించారు. గ్రామంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలకు భరోసానివ్వడం కోసం న్యాయ అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. భాస్కర్ రావు-అరుణ దంపతులు గ్రామంలోని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం భాస్కర్ రావు మాట్లాడుతూ మోరంచపల్లి ప్రజల దీన పరిస్థితిని టీవీలలో చూసి ప్రజలకు మనోధైర్యం నింపడం కోసం సతీసమేతంగా వచ్చినట్లు చెప్పారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణ బాబు మాట్లాడుతూ గ్రామస్తులకు అండగా నిలవడం కోసం యావత్తు న్యాయవ్యవస్థ ప్రజల వద్దకు వచ్చిందన్నారు. సమాజంలోని స్వచ్ఛంద సంస్థలు, అన్ని వర్గాల ప్రజలు బాధితులకు అండగా నిలవాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందన్నారు. వరదల్లో కుటుంబ సభ్యులను కోల్పోయిన వారిని జిల్లా జడ్జి ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జయరాం రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి రామచంద్ర రావు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అప్రమత్తం

- డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ములుగు: సీజనల్ సమయంలో కీటక జనిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య సూచించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఆరోగ్యశాఖ కార్యాలయంలో సబ్ యూనిట్ అధికారులు, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్లతో కీటక జనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించి జ్వరం, తలనొప్పితో బాధపడుతున్న వారి వివరాలను సేకరించాలని సూచించారు. మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు(మేల్) రక్త నమూనాలను సేకరించాలన్నారు. మలేరియా పాజిటీవ్ ఉంటే వారికి ట్యాబ్లెట్లు అందించాలని సూచించారు. ఇప్పటి వరకు సేకరించిన నమూనాలపై ఆరా తీశారు. గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో సిబ్బంది అంకితభావంగా విధులు నిర్వహించాలన్నారు. నీటి నిల్వలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తొలగించాలని, గ్రామ పంచాయతీ సిబ్బంది సహాయం తీసుకోవాలన్నారు. ప్రతీ శుక్రవారం ఫ్రైడే, డ్రైడే చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు దోమతెరలు వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల వారికి దోమల మందు పిచికారీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ క్రాంతి కుమార్, ఇన్‌చార్జ్ అసిస్టెంట్ మలేరియా అధికారి దుర్గారావు, మాస్ మీడియా అధికారి తిరుపతయ్య, సీహెచ్‌ఓ సంపత్ రావు, హెచ్‌ఈ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డీఎల్ యంత్రాలను మెరుగుపర్చాలి

భూపాలపల్లి అర్బన్: భూగర్భ గనుల్లో నడిపిస్తున్న ఎస్‌డీఎల్ యంత్రాల పనితీరును మెరుగుపర్చాలని సింగరేణి ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్, ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ వెంకటేశ్వర్‌రెడ్డి ఏరియా అధికారులను ఆదేశించారు. శనివారం ఏరియా అధికారులతో డైరెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూగర్భ గనుల్లో నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకతకు చేపట్టవలసిన ప్రణాళికలు, తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు గురించి వివరించారు. యంత్రాలకు సంబంధించిన విడిభాగాల వినియోగం, యంత్రాల పనితీరు గురించి డైరెక్టర్లు అధికారులను అడిగి తెలుసుకున్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి చేపట్టాలని డైరెక్టర్లు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీఎం శ్రీనివాసరావు, అధికారులు వెంకటయ్య, జోతి, ఎన్వీ రావు, తుకారాం, రామకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

చెరువుల గండ్లను పూడ్చాలి



ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రాజేందర్‌గౌడ్

ములుగు: ఇటీవల కురిసిన వర్షాలతో చెరువులకు పడిన గండ్లను పూడ్చాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డితో కలిసి రైతులు పలు సమస్యలపై ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రామప్ప, లక్నవరం, మల్లూరు ప్రాజెక్టు కింద పంట కాల్వలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. దీంతో చివరి ఆయకట్టు రైతులకు నీరు అందే పరిస్థితి లేదన్నారు. చెరువులకు గండ్లు పడడం ద్వారా నీరు వృథా అవుతుందని తెలిపారు. వరద ప్రవాహానికి గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఇసుక మేటలు వేశాయని సాగుకు ప్రతికూల వాతావరణ ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వం తరపున స్పందించి వెంటనే ఇసుక మేటలను తొలగించాలన్నారు. కొట్టుకుపోయిన పంటలకు నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండి.చాంద్ పాషా, బండి శ్రీనివాస్, కొండం రవీందర్‌రెడ్డి, నూనేటి శ్యాం, శంకరయ్య, దేవేందర్‌రావు, సదానందం, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

రుగ్మతలకు శాశ్వత పరిష్కారం యోగా



మాట్లాడుతున్న కేంద్రం ఇన్‌చార్జ్ రవీందర్

భూపాలపల్లి రూరల్: మనిషి మానసిక, శారీరక రుగ్మతలకు శాశ్వత పరిష్కారంగా యోగా చక్కని ఔషధంగా పనిచేస్తుందని హార్ట్ ఫుల్ నెస్ సంస్థ భూపాలపల్లి సెంటర్ ఇన్‌చార్జ్ రవీందర్ అన్నారు. శనివారం భూపాలపల్లిలోని హార్ట్ ఫుల్ నెస్‌ధ్యాన కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్, నోడల్ కోఆర్డినేటర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా హార్ట్ ఫుల్ సంస్థ యోగా, ధ్యానం శిక్షణ ఉచితంగా అందిస్తుందన్నారు. ప్రతి రోజు ధ్యానం చేయడం మూలంగా శరీరంలోని అన్ని నాడులు ఉత్సాహంగా పనిచేస్తాయని చెప్పారు. తద్వారా మానసిక రుగ్మతలు తొలిగిపోతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో యోగా సాధకులు గోపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, రమేష్, లలిత, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాంగళ్య షాపింగ్‌మాల్ చేయూత



చీరలను పంపిణీ చేస్తున్న నమశ్శివాయ

ఎస్‌ఎస్ తాడ్వాయి: మండలంలోని మేడారం, ఊరట్టం, కన్నెపల్లి గ్రామాల్లోని వరద బాధితులకు హనుమకొండలోని మాంగళ్య షాపింగ్‌మాల్ నిర్వాహకులు శనివారం చేయూతనిచ్చారు. బాధితులకు చీరలు అందించి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా మాంగళ్య షాపింగ్‌మాల్ చైర్మన్ కాసం నమశ్శివాయ మాట్లాడుతూ ఇటీవల వరదలకు సర్వస్వం కోల్పోయిన బాధితులకు తనవంతు సాయంగా 1500 చీరలు అందించామన్నారు. దాతలు స్పందించి వరద బాధిత కుటుంబాలను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తుమ్మ ప్రభాకర్‌రెడ్డి, మ్యగస్ యాడ్స్ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీపై కేసు నమోదు


మహబూబాబాద్ రూరల్: అధికార బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నెల్లికుదురు జెడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డిపై తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ పట్టణంలోని సర్వే నంబర్ 551/1, 551/2 లో ఉన్న 6 ఎకరాల ప్రభుత్వ భూమిలో ప్లాట్లు చేసి అధికార పార్టీకి చెందిన నెల్లికుదురు జెడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్ రెడ్డి విక్రయిస్తున్నట్లు అధికార పార్టీకి చెందిన మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్, ఆర్‌ఐ రహమాన్ విచారణ చేపట్టి ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈక్రమంలో జెడ్పీటీసీతోపాటు మరికొందరిపై ఐపీసీ 447, 427 సెక్షన్ల కింద మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు.

హత్యాయత్నంలో..

నెల్లికుదురు : భార్యపై హత్యాయత్నం చేసిన భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. శనివారం ఎస్సై వివరాలు వెల్లడించారు. మండల కేంద్రానికి చెందిన దోమల రాజయ్య– కమలమ్మ దంపతులు జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో రాజయ్య ఓ మహిళతో 10 ఏళ్ల క్రితం వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో కమలమ్మతో గొడవలు మొదలయ్యాయి. పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి కమలమ్మ వేరుగా ఉండాలని తీర్మానం చేశారు. ఈ నెల 4న రాత్రి 9 గంటలకు కమలమ్మ ఉంటున్న ఇంట్లోకి వెళ్లాడు. అంతకు ముందే కమలమ్మ తయారు చేసి పెట్టుకున్న టమాట పచ్చడిలో విషం కలిపాడు. కమలమ్మ పచ్చడిని పోపు చేద్దామని వేస్తుండగా పొంగుతూ నురుగ వస్తుండటంతో అనుమానం వచ్చిచూడగా ఏదో వాసన వచ్చింది. వెంటనే తన భర్త చంపడానికి తను తినే పచ్చడిలో మందు కలిపినట్లు పోలీస్‌స్టేషన్‌లో కమలమ్మ ఫిర్యాదు చేయగా రాజయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.



స్నేహితం



మన కోసం మనం ఎంపిక చేసుకునే ఓ అద్భుత బంధం స్నేహబంధం. తల్లిదండ్రులు జన్మను.. తోబుట్టువులను ఇస్తే.. స్నేహితులను మాత్రం మన అభిరుచికి తగ్గట్టుగా మనమే ఎంచుకునే అవకాశం ఉంటుంది. చిన్ననాటినుంచి కలిసిమెలిసి ఉంటూ.. ఒకరికి ఒకరుగా తోడుండేవారే స్నేహితులు. పాఠశాల.. ఇంటి పక్కన వారితోనో మాత్రమే కాకుండా కొన్నిసార్లు ప్రయాణాల్లో పరిచయమయ్యే వారు స్నేహితులుగా ఉండేవారు.. కానీ, ప్రస్తుతం పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో ఆన్‌లైన్ పరిచయాలతోకూడా స్నేహం కొనసాగిస్తున్నారు.. ఎంత వయస్సు పెరిగినా.. ఏరా.. ఒరేయ్.. అని పిలిచే స్నేహితులు ఉంటే జీవితం ఎంతో ఆనందంగా ఉంటుందంటారు.. ఆ మధురమైన పిలుపును ఆస్వాదించే అనేకమంది. ఈనేపథ్యంలో నేడు 'స్నేహితుల దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం.

- మిత్రులకు అండగా..
- ఆపదలో తోడుగా..
- ఏళ్లుగా కొనసాగుతున్న ఎన్నో స్నేహబంధాలు
- నేడు స్నేహితుల దినోత్సవం

కష్టాల్లో తోడుగా ఉంటూ..



కేసముద్రం : మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న బాల్యమిత్రులు (ఫైల్)

కేసముద్రం: ఆపదలో ఉన్న బాల్యమిత్రుల కుటుంబాల కన్నీళ్లను తుడుస్తూ స్నేహమంటే సంతోషంలోనే కాదు, కష్టాల్లో కూడా తోడుగా ఉంటూ స్నేహమంటే ఇదేరా.. అని చాటుతున్నారు కేసముద్రంస్టేషన్ జెడ్పీఎస్‌ఎస్ 1993–94 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు. కేసముద్రం విలేజ్‌కి చెందిన 20 మంది పూర్వవిద్యార్థులు 1998లో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి మిత్రుల్లో ఎవరికి ఆపద వచ్చినా ఆదుకోవాలని ఆ మిత్రులు నిర్ణయించుకున్నారు. కేసముద్రం విలేజ్ నుంచి మొదలైన అసోసియేషన్ క్రమంగా మండల స్థాయి వరకు ఏర్పాటైంది. బ్యాచ్‌లో ఉన్న మిత్రులందరినీ కలుపుకుంటూ ఆపదలో ఉన్న మిత్రులకు ఆర్థికసాయం అందిస్తున్నారు. రూ.25వేల నుంచి రూ.1.60 లక్షల వరకు ఆర్థికసాయం అందించే స్థాయికి ఎదిగారు. ప్రస్తుతం ఈ అసోసియేషన్‌లో 150 మంది మిత్రులు భాగస్వాములుగా ఉన్నారు.

ఆడపిల్లల విద్యకు చేయూత



సింగిల్ గర్ల్ చైల్డ్ అక్షితకు స్కూల్ ఫీజు చెల్లిస్తున్న ల్యాబర్తి మిత్ర మండలి బాధ్యులు

కాజీపేట అర్బన్: వర్ధన్నపేట మండలంలోని ల్యాబర్తికి చెందిన యువత ల్యాబర్తి మిత్ర మండలిని, మనఊరు మన కోసం పేరిట ఒక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ మిత్రులంతా వివిధ వృత్తుల నేపథ్యంలో పట్టణంలో స్థిరపడినప్పటికీ గ్రామంలోని వారికి ఆపదలో చేయూతనిస్తున్నారు. రెండేళ్లుగా గ్రామంలోని సింగిల్ గర్ల్ చైల్డ్‌ను ఎంపిక చేసుకుని విద్యకు పూర్తి ఫీజును చెల్లిస్తున్నారు. గ్రామానికి చెందిన గొట్టం అశోక్ కోవిడ్‌తో మృతి చెందగా మిత్రులు, గ్రామస్తులు కలిసి రూ.3,15,700 కుటుంబానికి అందజేశారు. పోలెపాక దిలీప్ మృతి చెందగా అతడి కుటుంబానికి రూ.10వేలు అందించి తమ ఔదార్యాన్ని చాటుకుంటున్నారు. మిత్రమండలిలో అన్నందాస్ కరుణాకర్, పిన్నింటి స్వాతి, తాత శ్రీధర్, వడిచెర్ల అమరేందర్, వీరమల్ల అనిల్‌కుమార్, అన్నమనేని అనిల్, బొల్లం శేఖర్, మడత రఘు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

కలిసి చదివారు..



స్నేహితుడికి సాయం అందజేస్తున్న తోటి మిత్రులు

డోర్నకల్ : స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో 1988–89 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన నాటి మిత్రులు నేటికీ తమ స్నేహాన్ని కొనసాగిస్తున్నారు. 35 ఏళ్ల క్రితం ఎక్కడెక్కడో స్థిరపడిన మిత్రులు.. తమలోని ఎవరికి ఆపద వచ్చినా తలా ఓ చేయి వేసి ఆదుకుంటున్నారు.. ఓ స్నేహితుడి కుమార్తె వివాహానికి రూ.45 వేలు, ఓ మిత్రుడికి పక్షవాతం రాగా చికిత్స నిమిత్తం రూ.15వేలు, ఓ స్నేహితురాలి భర్తకు అనారోగ్యమైతే రూ.15 వేలు, ఓ మిత్రుడు ప్రమాదంలో గాయపడితే రూ.25వేలు, ఓ మిత్రుడు అనారోగ్యంతో చనిపోతే రూ.10 వేలతో పాటు మిత్రుల పిల్లల చదువులకు ఆర్థిక సహాయమందిస్తూ తోడుగా ఉంటున్నారు. మిత్రుల్లో మహేష్, బొర్రా శ్రీనివాస్, వీరభద్రం, కోటేష్, లచ్చు నాయక్, రవీందర్ లింగయ్య, రామాచారి ఉన్నారు.

ఐకమత్యం చాటుతున్న బాల్య స్నేహితులు



కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మిత్రుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న తోటి స్నేహితులు(ఫైల్)

మరిపెడ రూరల్: మరిపెడ మండలంలోని ఎల్లంపేట హైస్కూల్ 1992–93 ఎస్సెస్సీ బ్యాచ్‌కి చెందిన పూర్వవిద్యార్థులు 30 ఏళ్లు దాటినా కలిసిమెలిసి ఉంటున్నారు. చిన్ననాటి స్నేహితులు ఎవరు ఆపదలో ఉన్నా.. అప్పన్నహస్తం అందిస్తున్నారు. తమ పాఠశాల విద్యార్థుల కోసం బెంచీలు, రెండు సైన్స్ ప్రయోగశాలల బల్లాలు అందజేశారు. బాల్యమిత్రుడు సాగంటి పాపయ్య మృతిచెందగా..బాధిత కుటుంబానికి రూ.50 వేలు, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న మరో క్లాస్‌మెట్ కరుణాబాయి కుటుంబానికి రూ.50 వేలు, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నడిగోటి శ్రీశైలం కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించి బాసటగా నిలిచారు.

సామాజిక సేవలో 'బెస్ట్' ఫ్రెండ్స్



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాలిసెట్ పుస్తకాలు అందజేస్తున్న బెస్ట్ ఫౌండేషన్ బాధ్యులు(ఫైల్)

విద్యారణ్యపురి: వివిధ వృత్తుల్లో ఉన్న వారు ఒక గ్రూప్‌గా ఏర్పడి 'బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్' పేరుతో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ.. పలువురిచేత బెస్ట్ అనిపించుకుంటున్నారు. సుమారు వేయి మందితో క్రియేట్ చేసిన వాట్సాప్ గ్రూప్‌లోని సభ్యులు తమకు తోచినంత ఫండ్ పంపించడం ద్వారా జమ అయిన మొత్తంతో తమ ఫ్రెండ్స్‌లో ఎవరికి ఆపద వచ్చినా చేయూతనివ్వాలనుకున్నారు. కానీ, రిజిస్ట్రేషన్ అనంతరం ఫౌండేషన్ ప్రస్తుతం విద్యార్థులకు పోటీపరీక్షల పుస్తకాలు పంచడంతోపాటు ఇతర సేవా కార్యక్రమాలు చేస్తుంది. సమాజ హితం కోసం నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తామంటున్నారు బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఉపాధ్యాయుడు పులి దేవేందర్.

స్నేహానికి నిదర్శనం.. హెల్పింగ్ హ్యాండ్స్



ఆర్థికసాయం అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు (ఫైల్)

తరిగొప్పుల : స్నేహితులకు తోడుంటూ స్నేహమంటే ఇదేరా అంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు తరిగొప్పులలోని ఉన్నత పాఠశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు. తమతో కలిసి చదువుకున్న మిత్రులకు ఆపత్కాలంలో ఆర్థికంగా ఆదుకుంటూ స్నేహానికి నిర్వచనంగా నిలుస్తున్నారు. 2004–05 విద్యాసంవత్సరంలో టెన్త్ పూర్తి చేసిన 66 మంది సభ్యులతో హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. తద్వారా నేటి వరకు 30 మంది స్నేహితులకు రూ.4 లక్షల పైగా అందజేసి ఆర్థికంగా ఆదుకున్నారు. గునింటి రాజపోషయ్య, కొయ్యడ శ్రీకాంత్, వంశీ, రమేష్ ముందుండి స్నేహితులను నడిపిస్తున్నారు.

మేమున్నామంటూ..



సంపత్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

తొర్రూరు: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984–85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆపదలో స్నేహితులకు ఆర్థిక చేయూతనిస్తూ ఆసరాగా నిలుస్తున్నారు. మేమున్నామంటూ ముందుకొచ్చి ఆపదలో ఉన్న స్నేహితులకు అండగా నిలుస్తున్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మిత్రుడు చాట్ల సంపత్‌కు రూ.1.3 లక్షలు, కంఠాయపాలెం గ్రామానికి చెందిన ఆర్‌ఎస్ చారికి రూ.50 వేలు, క్వింటా బియ్యం అందజేశారు. మిత్రుడు నాగేశ్వరావు ఆర్టీసీ కండక్టర్‌గా ఉండగా.. బస్సు యాక్సిడెంట్‌లో కాళ్లు విరగడంతో రూ.70 వేలు నాగేశ్వరరావు కుమార్తె ఫీజు నిమిత్తం అందజేశారు.

ఆపదలో అండగా..



సాయం అందజేస్తున్న స్నేహితులు

కొడకండ్ల: తమతో కల్సి చదువుకొన్న స్నేహితులకు ఆపదలో అండగా ఉంటూ తమవంతు చేయూతనిస్తున్నారు.. కొడకండ్ల ఉన్నత పాఠశాలకు చెందిన 1993–94 విద్యార్థులు. ఆరు సంవత్సరాలుగా స్నేహితుల అకాల మరణాలు, నిరుపేద స్నేహితుల కుటుంబాల్లో వివాహాలకు దాదాపు రూ.5లక్షల వరకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. 30ఏళ్ల క్రితం కల్సిమెలసి చదువుకొని వివిధ హోదాల్లో అనేక ప్రాంతాల్లో జీనవం సాగిస్తూ.. ఆపద సమయంలో స్నేహితులకు అండగా ఉంటూ ఆదర్శనంగా నిలుస్తున్నారు ఈ స్నేహితులు. గ్రూప్ చైర్మన్ పసునూరి మధుసూదన్ ప్రత్యేక చొరవ తీసుకొని మిత్రుల సహకారంతో ముందుకెళ్తున్నారు.

నీ స్నేహం..



ఏనాడు పుట్టిందో ఈ తియ్యని రాగం
ప్రతిక్షణం ధ్వనించే హృదయ స్పందనం
ఎవరు పలికారో ఈ తారక వేదమంత్రం
ప్రతిమదిలో జపించే సుప్రభాతం

అనుకోని పలకరింపులు కలిపిన పరిచయం
తొలకరి చినుకులకు చిగురించిన వసంతం
ప్రతీది పంచుకునేంత దగ్గరైన ప్రయాణం
దూరంగా వెళ్లినా.. విడిపోని అనుబంధం

ఆపదలో ఆదుకునే ఆత్మీయ బంధం
కష్టాల్లో వెన్నంటే నిలిచే ధైర్యం
తిరిగి ఏమి ఆశించని నిస్వార్థ రూపం
ఏమిచ్చి తీర్చుకోను తీరని రుణం

కనిపెంచిన అమ్మ నాన్నలకు స్వరూపం
అడగకుండానే దేవుడిచ్చిన వరం
మరుపురాని జ్ఞాపకాలు రాసిన పుస్తకం
మరి మరి చదివే మధుర ప్రబంధ కావ్యం

కుల మత తారతమ్యాలకు అతీతం
పేద ధనిక అంతర భావాలు శూన్యం
ఒకగూటి పక్షుల్లా ఎగరడం నైజం
ఒకఇంటి బిడ్డల్లా ఉండటం నిజం.

– అందె భవాని

ట్రాక్టర్ ఇంజన్ కిందపడి వ్యక్తి మృతి



విష్ణు మృతదేహం

వర్ధన్నపేట: బురద దుక్కి దున్నుతున్న కౌలు రైతు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఇంజన్ కింద పడి మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని బొక్కలగూడెంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కథనం ప్రకారం మండలంలోని ల్యాబర్తి గ్రామానికి చెందిన బడితపురం మణి అలియాస్ విష్ణు(32) సమీప గ్రామంలోని వంగపండ్ల రాములుకు చెందిన భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం బురద దుక్కి దున్నుతున్న సమయంలో తన ట్రాక్టర్ బురదలో దిగబడి పోయింది. దీంతో మరో ట్రాక్టర్‌తో లాగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఇంజన్ బోల్తా పడడంతో ఇంజన్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు రైతుల సాయంతో జేసీబీ యంత్రాన్ని రప్పించి ట్రాక్టర్ ఇంజన్ తీయగా అప్పటికే విష్ణు మృతి చెంది ఉన్నాడు. విష్ణుకు రజినక, ఇద్దరు కుమారులు ఉన్నారు. కౌలు చేసుకోవడంతో పాటు తన ట్రాక్టర్ అద్దెకు వెళ్లి జీవనం సాగిస్తున్న క్రమంలో విష్ణు మృతిచెందడంతో తల్లిదండ్రులు పద్మ ఉపేందర్, సోదరి వినిత భార్య పిల్లల రోదనలు మిన్నంటాయి.

చెరువులో పడి యువకుడు..



వినోద్(ఫైల్)

మల్హర్: ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి చెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని తాడిచర్ల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. కొయ్యూరు ఏఎస్సై కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. తాడిచర్ల బీసీ కాలనీకి చెందిన పెనుగొండ వినోద్ (30) హమాలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈక్రమంలో శనివారం ఉదయం 7 గంటలకు హమాలీ సంఘం భవనం వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య లక్ష్మి ఫోన్ చేయగా.. స్విచ్ఛాఫ్ ఉండడంతో మేనల్లుడు నవీన్‌తో కలిసి లక్ష్మి హమాలీ సంఘం భవనం వద్దకు వెళ్లి చూడగా.. కన్పించడలేదు. దీంతో పక్కనే ఈదుల చెరువు వద్దకు వెళ్లారు. బహిర్భూమి నిమిత్తం వినోద్ చెరువు వద్దకు వెళ్లి, ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి, ఈత రాకపోవడంతో నీటిలో మునిగి చనిపోయినట్లు ఏఎస్సై స్పష్టం చేశారు. వినోద్‌కు భార్య, కుమారుడు రాజుకుమార్, కూతురు రష్మిత ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నట్లు ఏఎస్సై వెల్లడించారు.

వివాహిత బలవన్మరణం



శృతి (ఫైల్)

మద్దిరాల (తుంగతుర్తి) : భర్త వేధింపులతో ఓ వివాహిత ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని బలవన్మరణానికి పాల్పడింది. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం రెడ్డిగూడెంలో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు జిల్లా మంగపేట మండలం కత్తిగూడెం గ్రామానికి చెందిన బోటమంచి శాంతయ్య కుమార్తె శృతి(32)కి మద్దిరాల మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన నాగెల్లి ఉపేందర్‌తో 13ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కూతురు సంతానం. ఉపేందర్ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న క్రమంలో ఉపేందర్ మద్యానికి బానిసగా మారి భార్యను చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన శృతి శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి గ్రామ శివారుకు వెళ్లి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. గమనించిన గ్రామస్తులు మంటలు ఆర్పి సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. 90శాతం కాలిన శృతి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మృతురాలి సోదరుడు తరుణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

మణిపూర్‌లో నాజీల పాలన

- మణిపూర్ రచయిత్రి కూర్పినా కిమ్కోవా కొంగ్సాయి



సదస్సులో మాట్లాడుతున్న మణిపూర్ రచయిత్రి

నయీంనగర్: మా తాత ముత్తాల నుంచి ఇక్కడే ఉన్నామని బ్రిటిష్ వారితో మా పూర్వీకులు యుద్ధం చేశారని మణిపూర్ రచయిత్రి కూర్పినా కిమ్కోవా కొంగ్సాయి అన్నారు. శనివారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో భారత్ బచావో సదస్సు హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు ఎస్.రామబ్రహ్మం, డి.ప్రవీణ్‌కుమార్‌ల అధ్యక్షతన నిర్వహించగా.. కిమ్కోవా కొంగ్సాయి మాట్లాడారు. తాము భారతీయులమేనని మాకు విడిపోవాలని లేదని తమని తరిమేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హద్దుల కోసం మమ్మల్ని ఊచకోత కోస్తున్నట్లు పేర్కొన్నారు. మణిపూర్‌లో నాజీల పాలన సాగుతోందని అన్నారు. రాష్ట్రంలోని కొండ ప్రాంతంలో ఉన్న ఖనిజ నిక్షేపాలను దోచుకొని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడానికి కుట్ర జరుగుతోందని చెప్పారు. భారత భూభాగాన్ని కొండకోనల్లో కాపాడింది కూకీలేనని మాకు ప్రత్యేక ప్రాంతం హోదా కావాలన్నారు. తెలంగాణ ప్రజలు చాలా మంచి వారని తాను 2014 నుంచి హైదరాబాద్‌లో ఉంటున్నానని అన్నారు. భారత్ బచావో జాతీయ కౌన్సిల్ సభ్యుడు గాదె ఇన్నయ్య మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని వినిపించారు. మనువాద, మతోన్మాద శక్తులు పెట్రోగిపోతున్నాయన్నారు. మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బి.సాంబశివరావు మాట్లాడుతూ ఆర్థిక, రాజకీయ, సామాజిక అంతరాలున్న దేశంలో యూసీసీ వల్ల అనేక సమస్యలు వస్తాయని అందుకే అంబేడ్కర్ యూసీసీ ని ఆర్టికల్44లో చేర్చాడని తెలిపారు. దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా మాట్లాడుతూ ప్రజలందరు నిగ్రహం పాటించాలన్నారు. అనంతరం హనుమకొండ సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి, వరంగల్ జిల్లా కార్యదర్శి ఎం.రవి, ఎంసీపీఐ నాయకుడు హంసారెడ్డి ప్రసంగించారు. భారత్ బచావో జాతీయ కౌన్సిల్ సభ్యుడు డా.ఎం.వెంగల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా, వివిధ ప్రజా నాయకులు పాల్గొన్నారు.

ఆటోల దొంగ అరెస్ట్, రిమాండ్

- రెండు ఆటోలు స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ రాఘవేందర్

స్టేషన్‌ఘన్‌పూర్: ఆటోలను దొంగిలించే నిందితుడు దండ్ల గణేష్‌ను డివిజన్ కేంద్రంలో శనివారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు సీఐ ఆలె రాఘవేందర్ తెలిపారు. ఈ మేరకు సీఐ విలేకర్లతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన నీరటి రాకేష్ గత నెల 30న రాత్రి తన ఇంటి ఎదుట ఆటోను ఉంచి ఉదయం చూసేసరికి లేకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఘన్‌పూర్‌లో వీయూపీ బ్రిడ్జి వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం జూకల్లు గ్రామానికి చెందిన నిందితుడు దండ్ల గణేష్ ఘన్‌పూర్‌లో చోరీ చేసిన రాకేష్‌కు చెందిన ఆటోను హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో పోలీసులకు పట్టుబడ్డాడు. గణేష్ ప్రస్తుత నివాసం కూకట్‌పల్లి గాజుల రామారం అని, ప్లంబర్‌గా పనిచేస్తూ ఆటోలను దొంగతనం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఘన్‌పూర్‌తోపాటు నిందితుడు జూలై 30న కాజీపేటలో మరో ఆటో దొంగిలించాడని, కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిపారు. గతంలోనూ సైబరాబాద్‌లోని నాచుపల్లి, గుంటూరు జిల్లా చిల్లకల్లు, కొత్తపేట పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఆటోలు దొంగతనం చేసి జైలుకు వెళ్లి వచ్చాడని తెలిపారు. నేరస్తుడి వద్ద నుంచి రెండు ఆటోలను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ మగ్ధుమ్, కానిస్టేబుళ్లు కుమారస్వామి, శ్రీను, కుమార్ ఉన్నారు.